


# సాయిన్సు మిస్టరీ

కవనశర్మ

డాక్టర్ వ్యాస్ లాబ్‌లో మిస్టర్ గణపతి కిటికీకి పక్కగా తల వంచుకొని ప్రయోగం చేస్తున్నాడు.

"నిన్ను పేపర్ను రాయటానికి కదా నేను పెట్టుకొన్నది. రెండేళ్లయినా నువ్వు ఒక్కటి రాయలేదు. నువ్వు మరో మూడు నెలల్లో అర్జెంటుగా ఒక థీసిస్సో రెండు పేపర్లో రాసివ్వకపోతే పుట్టింటికి తోలేస్తాను జాగ్రత్త" అని వ్యాస్ ఆ క్రితం రోజే గణపతిని బెదిరించాడు.

వ్యాస్‌కి గత్యంతరం లేకపోయింది. ఆ యూనివర్సిటీ తరిగితే తిరిగి పెరిగే శక్తులు (రిన్యూవబుల్ ఎనర్జీస్) గురించి విజయవంతంగా పరిశోధించిన శాస్త్రజ్ఞుడిని ప్రొఫెసర్‌గా నియమించడానికి నిర్ణయించుకొని ఒక కొత్త కుర్చీ ఎత్తుగా అందంగా చేయించి వ్యాస్‌ని ఆశపెట్టింది ఆ సమయంలో తగుదునమ్మా అంటూ డాక్టర్ వాది పోటీకి వచ్చి, "ఆ కుర్చీ నాదే! నాకోసమే వేసారు" అనటం మొదలు పెట్టాడు. అయితే ఆ కుర్చీ ఎత్తుగా ఉండటంచేత అది ఇద్దరికి అందలేదు. ఎన్నో మొగ్గలు వేసినా లాభం లేకపోయింది.

"రిన్యూవబుల్ ఎనర్జీస్ మీద విద్యార్థులచేత థీసిస్‌గాని పేపర్నుగాని రెండూగాని రాయించి వాటిమీద నిలబడితేగాని ఆ కుర్చీ అందదు" అన్న విషయం ఆ కుర్చీమీద వ్రాసుందని ఈ ఇద్దరికి తెలియవచ్చింది.

వ్యాస్ మరింక లాభంలేదని గణపతిని బెదిరించాడు. గణపతి అప్పటికే ఎన్నో ప్రయోగాలు చేసి ఉన్నాడు. ఏదీ విజయవంతం కాలేదు.

"గురూ! నీ తల నా కళ్లల్లో గ్లేర్ కొడ్తోంది. కాస్త యాంగిల్ మార్చు" అన్నాడు. ఎదురుగా పనిచేస్తున్న మరో సహ ప్రయోగకుడు, కళ్లకి చేతులడ్డు పెట్టుకొంటూ.

గణపతి తల ఎగరేసి "హఁ" అన్నాడు.

"థాంక్స్!" అన్నాడు సహ ప్రయోగకుడు.

గణపతి తల మధ్యకి చెయ్యిపోనిచ్చి జుట్టు పీక్కోపోయాడు చెయ్యికి పట్టుకోడానికి ఓ పరక దొరకక నున్నటి తలమీద, తలం మీద చెయ్యి జారిపోయింది.

"హఁ" అన్నాడు గణపతి తల విదుల్చుకొంటూ.

"అదే వద్దన్నాను. నీతల నిందాకట పొజిషన్‌లో కుదురుగా ఉంచుకో!" అని కసురుకొన్నాడు సహ ప్రయోగకుడు.

గణపతి నిర్ణయించుకొన్నాడు. తన వంటికి రిసెర్చి పడదు. పెట్టే బేడా సర్దుకోవటమే ఉత్తమ మార్గం అనుకొని హాస్టల్‌కి నడిచాడు.

అతను తన గదికి వెళ్లి సామాన్లు సర్దుకొంటుంటే ఒక నీలం కాయితం, కిటికీలోంచి ఎవరో పడవేసిన కాయితం కనిపించింది.

## శుభ వార్త!

రవికిరణ్ భగవాన్‌గారు మీ సమస్యలు తీరుస్తారు అవి ఎల్లాంటివైనా! ఆయన అమెరికా వెళ్లినప్పుడు ఆయన చుట్టు పట్ల ఎక్కడా అయిదడుగుల దూరంలో హత్యలు జరగలేదు అని ఆ దేశపు శాస్త్రజ్ఞులు గమనించి వెల్లడించారు. ఆయన ఉన్నచోట సమస్య లుండవు. ఆయనని ధ్యానించిన వారికి సమస్త శుభాలు చేకూరుతాయి. ఆయన సూర్య భగవానుడి శక్తిని తనలో జీర్ణించుకొని అవసరమైనప్పుడు దాన్ని వెలికితీసి భక్తులకి బూడిదలాంటి మహిమాన్విక పదార్థం రూపంలో ఇస్తారు. త్వరపడండి.

ఇట్లు

అన్ని సమస్యలు తీర్చుకొన్న భక్తుడు.

గణపతి "నమ్మి చెడను కదా! ముందే చెడి ఉన్నాను. ఒక రాయి విసిరి చూస్తాను" అని బయల్దేరాడు.

భగవాన్ చేతో తల తడుముకొని, అదృష్టం కొద్దీ రాయి ఒత్తైన తన తల కట్టులో ఇరుక్కున్నదని గమనించి విసిరినవాడు ఏకలవ్యుడు, అర్జునుడు విలియమ్ టెల్ కానందుకు గణపతి అయినందుకు సంతసించి.

"అందరిలాగా నువ్వు పూజకి పూలే వాడరాదా!" అని

మందహాసించి మందలించాడు. తరువాత అతని ద్వారా అతని సమస్య తెలుసుకొని తన శిష్యుడిని వేలితో చూపించాడు.

ఆ శిష్యుడు గణపతి చేతిలో రవికిరణ్ భగవాన్ యొక్క చిత్ర పటాన్నుంచి," అయిదు రూపాయలు" అన్నాడు

"ఏమిటది?" అని అడిగాడు గణపతి.

"ఇది సాయి ఫొటో. దీన్ని ఎండ,పొడ తగిలేచోట ఉంచి పూజించు మహిమ చూపుతుంది." అని శిష్యుడు సెలవిచ్చాడు. అతగాడికి స్వామిని సాయి అనటం ఓ అలవాటు.

గణపతి ఆ పటాన్ని తన గదికి తీసుకువెళ్ళి కిటికీలో పెట్టి ఆ మర్నాడు దానికి దండంపెట్టుకొని ప్రయోగంచేసే నిమిత్తం లాబ్‌కి వెళ్ళి దీక్షతో ప్రయోగంచేసి సాయంత్రం తన గదికి వచ్చాడు.

సాయి బొమ్మ మీద తెల్లటి బూడిద ఏర్పడి ఉంది. "ఇదే ఆ కాయితంలో చెప్పిన మహిమాన్విత పదార్థం అయి ఉండాలి" అనుకొన్నాడు గణపతి.

మర్నాడు ఆ బూడిద సుదట ధరించి లాబ్‌కి వెళ్ళే-సరికి వ్యాస్ వ్యాఘ్రంలాగా ఇటూ అటూ కోపంగా తిరుగుతున్నాడు.

"ఎంతవరకు వచ్చింది?" అని గాండ్రించాడు వ్యాస్.

గణపతి కంగారు పడ్డాడు., "కిటికీ దాక కాదు సూర్యుడు.....ఉహు.... రవికిరణ్!.. సౌరశక్తి.... వచ్చింది. కాదు. కాదు. రాలింది బూడిద" అని ఆ క్రితంరోజు జరిగిన విషయం టూకీగా వ్యాస్‌కి చెప్పబోయాడు.

"బూడిద రాలిందా! నువ్వు జోగివి నేను యోగిని మనిద్దరం పేపర్లు రాసుకొందామనుకొంటే బూడిద రాలిందన్నమాట" అన్నాడు వ్యాస్ కోపంగా.

గణపతి కిటికీలో తను పటం పెట్టడం అది సూర్యకిరణ స్పర్శతో బూడిద రాల్చటం అన్న విషయాన్ని వ్యాస్‌కి ఓ అరగంటకాలం తీసుకొని చెప్పేయ గలిగాడు.

"అదేం పటమన్నావ్?".

"సాయి" అన్నాడు గణపతి అతనికి భక్తుడు స్వామి అనటానికి నోరు తిరగక సాయి అన్నాడని తెలియదు అదే నిజమైన పేరనుకొన్నాడు.

"సాయితో సౌరశక్తి పదార్థంగా మారుతోం-దంటావు. అంటే మనం సాయి సహాయంతో సౌర-శక్తిని పదార్థంగా మార్చగలమని ప్రపంచానికి ఋజువుచేస్తే నోబెల్ బహుమానమో, ఎప్పారెస్సో తప్పదు."

మర్నాడు సాయి పటం ఫిజిక్స్ లాబ్‌కి మారింది. దాన్ని గాజుపెట్టె మధ్యలో ఏట వాలుగా బిగించారు. ఆ పెట్టెని సూర్యరశ్మి తగిలేచోట ఉంచారు. ఒకరోజు సాయికి పూజచేసి మరోరోజు చేయకుండా ప్రయోగం చేసారు. రెండు రోజులు బూడిదలాంటి పదార్థం ఏర్పడి, ఏటవాలుగా అమర్చి ఉన్నందు-వలన జారి పెట్టె అడుగునపడి, పేరుకొంది.

"అయితే పూజ అనే పెరామీటర్ మీద పదార్థం ఏర్పడటం ఆధార పడదని తేలింది. సూర్యశక్తిని సాయి పదార్థంగా మార్చగలగటం అలౌకికమైన మహిమ కారణం కాదు. కేవలం భౌతికమైన ప్రక్రియ సాయి కేవలం ఒక పరికరం. ఈ విషయం మనం కనుక్కొన్నాం. అంటే సౌరశక్తిని పదార్థంగా మార్చ-గలిగే పరికరాన్ని మనం కనుక్కొన్నాం. ఇది భౌతిక శాస్త్రంలో ఓ పెద్ద విప్లవాత్మకమైన విషయం. ఈ పద్ధతిని మనం సాయిన్సు అందాం: సాయిన్సు అంటే సైన్సును సాగదీయగా వచ్చేదని, సైన్సు ఫ్రాంటియర్సును పొడిగించేదని అర్థం. అది సాయి లోంచి వచ్చిన ధ్వని కూడా ఉంది" అని వ్యాస్ దీర్ఘోపన్యాసం ఇచ్చాడు.

శిష్యులందరు చప్పట్లు కొట్టారు.

"సౌరశక్తిని పదార్థంగా మర్చే విప్లవాత్మకమైన పద్ధతి – సాయిన్సు ఇది నీ థీసిస్ పేరు" అంటూ వ్యాస్ గణపతి థీసిస్‌కి నామకరణం చేసాడు.

గణపతి ఉత్సాహంగా థీసిస్ వ్రాయటం మొదలు పెట్టిన నాలుగోరోజు సాయినుంచి బూడిదలాంటి పదార్థం రాలటం మానేసింది. గణపతి కంగారు పడి రవి కిరోణ్ భగవాన్ ఆశ్రమానికి పరిగెత్తాడు. స్వామి-వారు మకాం ఎత్తేసారు. సాయి ఫొటో అమ్మిన శిష్యుడింకా ఉండి జంబు ఖానాలు ఎత్తుతున్నాడు. గణపతి తన దగ్గరున్న సాయి ఫొటో పని చెయ్యడంలేదని, దాంతో తన బుర్ర పని చెయ్యడం-లేదని, బుర్ర పని చెయ్యనివాళ్ళు తన దగ్గర పని చెయ్యనవసరం లేదని వ్యాస్ తనతో అన్నాడని వ్యాస్ తన గైడని, ఆ గైడు తనని ఇంటికి గైడు చెయ్యడం తనకి బావుండదని శిష్యుడికి చెప్పాడు.

"ఓ షింతే కదా! సాయి వెళ్ళిపోయినా నా దగ్గరింకా ఆరి ఫొటోలున్నాయి. ఆ డజనిచ్చేదా?" అని అడిగాడు శిష్యుడు.

"ఇవ్వండి."

"వీటన్నింటికి ఒకసారే మహిమ కలిగిస్తే ఒకసారే అవి శక్తి పోగొట్టు కొంటాయి. కనుక ఇవి ఒక దాని తరువాత ఒకటి వాడు."

"మహిమలు మాలాంటి సైంటిస్టులు ఒప్పుకోరో పట్టాన. కాని ప్రతి పరికరాని దాన్ని సిద్ధ పరిచే పద్ధతుంటుంది. సాయికి కూడా అల్లాంటి దుంటుందని నమ్ముతున్నారు. అది చెప్పండి"

"ఏదో ఒకటనుకో! సాయికి కూడా సైంటిఫిక్‌గా ఉండటం ఇష్టం సాయిని రెడీ చెయ్యటానికిమార్గం ఏ ఉంటే సాయిని పూజించి, దానికి ఈ సీసాలోని ద్రవంతో స్నానం చేయించాలి. అదెట్లా అంటే ఓ పరి శుభ్రమైన గుడ్డముక్క నందులో ముంచి దానితో సాయిని తడిపి ఎండ బెట్టాలి. ఆ తరువాత అది శక్తి చూపుతుంది చందన చర్చలాగా చెయ్యాలి అర్థమైందా?

"శక్తిని పదార్థంగా మారుస్తుంది." అన్నాడు గణపతి ప్రొసీజర్ అర్థమైందని తెలూపుత్తూ.

"ఏదో ఒకటి! డజన్ సాయి ఫొటోలు సీసాడు ద్రవం నూర్రూపాయలు."

గణపతి డబ్బిచ్చి తీసుకువచ్చి సాయిని శిష్యు-డిచ్చిన ద్రవంతో చర్చించి ఆ పైన సెటప్‌లో బిగిం-చాడు. సాయి శక్తి చూపించటం, కాదు సౌరశక్తిని పదార్థంగా మార్చటం మొదలు పెట్టింది.

సరిగ్గా ఆ సమయంలో ఎన్‌వైర్‌మెంటు డిపార్ట్ మెంట్‌లో ఇకాలజీవింగ్‌లో ఉండే ఎలుక



బందరులో ఇటీవల మచిలీపట్నం లయన్ లేడీస్ "బేబీ షో" నిర్వహించిన సందర్భంగా తీసిన చిత్రం.

తప్పించుకువచ్చి ఆ ద్రవపు సీసాను పడతోసింది. ఆ ద్రవం నేలపాలైంది. అది జరుగుతున్నప్పుడు గణపతి అక్కడే ఉండి గమనించాడు. అతను దాంతో కోపిష్ఠుడై ఒక కర్రతో ఆ ఎలుకని ఒక దెబ్బ వేశాడు. సైన్సులో యాదృచ్ఛికత అనే ప్రిన్సిపుల్ ప్రకారం ఆ ఎలుక ఆ దెబ్బ తగిలి చచ్చి పోయింది! దాన్ని తీసుకువెళ్ళి ఇకాలజీ కుర్రాళ్ళు భోంచేసే మెస్‌లో సాంబారులో పడేసాడు. అయితే ఆ మెస్‌లో కొందరు కెమిస్టులు కూడా భోంచేస్తారు. వాళ్ళల్లో ఎవరికి కూడా పులుసులో ఎలుక నచ్చదు. కొందరికి గుమ్మడికాయ, కొందరికి బెండకాయ నచ్చుతుంది. ఆ విషయంలో పోట్లాడుకున్నారు కూడాను ఒకసారి. అందుకని ఒక వారం గుమ్మడి మరోవారం బెండ వేయాలని వంటాయనికి ఆదేశించారు. కాని ఎలుకల విషయంలో వాళ్ళందరిది ఏకాభిప్రాయం కావటంతో అది వెయ్యమని వంటాయన మీద ఎవరు వత్తిడి తెచ్చారో తెలియక, "చెప్పమని" అతనిపై వత్తిడి తెచ్చారు.

"బాబోయ్ నేను వెయ్యలేదు. ఆ పన్నీ మెస్ గణపతిగారు దాన్ని తెచ్చి పులుసులో పడేసారు. ఆయన చేతిలో కర్ర ఉంది. అప్పటికీ "నే నాయనో! ఈ మెస్‌లో కుర్రాళ్ళు పులుసు ముక్కల్లో పచ్చి ఉంటే చంపేస్తారు. అల్లా ఆ ఎలుకని పడేయమాకండి. అన్నాను. 'పిచ్చిగా మాట్లాడ్తే ఈ కర్రతో నిన్నోటి వేసి, నిన్ను కూడా పచ్చిగా పులుసులో కలిపేస్తాను' అన్నాడండి ఆయన కోపంగా. నేనింక మాట్లాడలేదు బాబులు" అన్నాడా వంటవాడు.

"ఎవరు గణపతా!" అని అందరు ఆశ్చర్య పోయాడు.

"మన దంత వైద్యుడు అతని నోట్లో వేలు పెడ్తే కొరకలేదుట. అల్లా కొర్కని విద్యార్థి అతనొక్కడే అన్నాడు కదా ఆయన.

"కాచలుచుకొన్న మావగా రొకడు మన గణపతిని నువ్వు ఇంద్రుడివి చంద్రుడివి అని పొగుడ్తూ వంటికి బటర్ రాసాడుట. అందులో కొంత వెన్న అతని నోట్లో పెట్టాడుట. గణపతి దాన్ని మింగలేక కక్కాడుట."

ఈ విధంగా గణపతి శాంతమూర్తి, అమాయకుడు అన్న విషయం గుర్తుకు తెచ్చుకొని అతనికి ఈ దురంతానికి పాలుపడేలా కోపం తెప్పించిన విషయం ఏమై ఉంటుందా అని ఆలోచించి అర్థంగాక అతన్నే అడుగుదామని గణపతి రూముకి వెళ్ళారు. అప్పుడతను పెట్టే బేడా సర్దుకొంటున్నాడు రెండోసారి. కెమిస్ట్రీ మిత్రుల కన్ని "నీ కొచ్చిన నష్టమేమిటి?" అని అడిగారు

"మీరార్పేవారా! తీర్చేవారా!"

"ఆర్పే వారము మేమే, తీర్చేవారము మేమే" అన్నారు పార్వతీశ్వరరావు, పరమేశ్వరరావును.

గణపతి నేల మీద వలికిన ద్రవాన్ని చూపుడు వేలితో చూపించి, చిటికిన వేలుతో కన్నీరు తుడుచుకుంటూ "ఈ జన్మలో నాకు పి.హెచ్.డి.

## బాలల నిధి సేకరణ

తృతీయ ప్రపంచ దేశాలలోని బాల బాలికల సహాయ నిమిత్తం పశ్చిమ జర్మనీకి చెందిన ఏడుగురు బాలలు గత సంవత్సరం 23 మిలియన్ల మార్కుల నిధులను సేకరించారు. వీరందరూ 13-16 సంవత్సరాల లోపు వారే. ఈ సందర్భంలో పత్రికలు, ప్రజ ఈ బాలలను ప్రపంచ ఛాంపియన్లుగా అభివర్ణించాయి. ఈ నిధులలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్, అమెరికా దేశాలతో 600 కొత్త ప్రాజెక్టులను ప్రారంభించారు. అంతర్జాతీయ బాలల దినం సందర్భంగా జరిగిన ఒక పత్రికా సమావేశంలో ఈ బాలలు వాళ్ళని ఈ నిధులను ఉపయోగించే సహాయ కార్యక్రమాలను వివరించారు. ఈ సంవత్సరం జనవరిలో పశ్చిమ జర్మనీలో మరో మూడు లక్షల మంది బాల బాలికలు ఇంటింటికి పాటలు పాడుతూ తిరుగుతూ 16.5 మిలియన్ల మార్కులను సేకరించారు.

(గ్లోబల్)

# సాయిన్సు మిస్టరీ

రాదు." అన్నాడు.

"ఇదేదో యాసిడ్ వాసన వేస్తోందే. అని ఇద్దరు పతనమైన ద్రవాన్ని ఓ ఖాళీ సీసాలోకి ఎత్తి తమ లాబ్‌కి తీసుకు వెళ్ళి పరీక్షించి, "ఓస్ ఇదా!" అని చెప్పి తమ లాబ్‌లో ఉన్న ఒక యాసిడ్‌ని బాటిల్‌తో తెచ్చి గణపతికిచ్చి, "ఇది మా లాబ్‌లో ఉంది తీసుకో" అని చెప్పారు.

అటు నుంచి ఇకాలజీ వింగ్‌కి వెళ్ళి "మీ ఎలుకల్ని వీధిలోకి విడిచి పెడ్తే వాటిని గణపతి కనక పులుసులోకి ముక్కలుగా 'కలిపితే అవి మీచేత తినిపించిగాని వదలం. ఎలుకలు జాగ్రత్త!" అని వార్నింగ్ ఇచ్చారు.

గణపతి థీసిస్ వ్రాసాడు. దాన్ని యూనివర్సిటీ వాళ్ళు వాళ్ళ రూల్సు ప్రకారం ఇద్దరు ఎగ్జామినర్సుకి పంపారు. అందులో ఒకాయన ఇమ్మన్నాడు డిగ్రీ, మరో ఆయన వీల్లేదు పొమ్మన్నాడు. డిగ్రీ రావాలంటే కనీసం రెండు మంచి రిపోర్టులు రావాలి. ఆ యూనివర్సిటీ రూల్స్ ప్రకారం మొత్తం ముగ్గురిని మించి అభిప్రాయం అడగరాదు. అందుకని మ.చ్చం మూడోవాడు అంటూ మూడో ఎగ్జామినర్‌కి థీసిస్ పంపారు. ఆయన డిగ్రీ ఇమ్మన్నాడు. ఆ రిపోర్ట్స్, ఆ యూనివర్సిటీ ఎకడమిక్ బాడీ ముందుకు వచ్చాయి. అవి చూసి ఆ బాడీ డిగ్రీ ఇమ్మంటే డిగ్రీ ఇచ్చేస్తుంది, ఆ యూనివర్సిటీ.

మొదటి రిపోర్టు ఒక నోబెల్ బహుమతి పొందిన శాస్త్రజ్ఞుడు వ్రాసింది. అది ఈ విధంగా ఉంది.

"ఈ విధంగా సౌరశక్తిని పదార్థంగామార్చటం అసంభవం. కొండిడేటు సాయి అని చెప్పబడే పటానికి.. 'యాసిడ్ పూసానని వ్రాసాడు థీసిస్‌లో పైగా సాయి అనేది కేవలం పరికరం/కేటలిస్టు మాత్రమేనని పదార్థంగా మారినది సౌరశక్తేనని క్లెయిమ్ చేసాడు. పదార్థాన్ని శక్తిగా మార్చటానికి చాలా పెద్ద తతంగం ఉందని అందరికి తెలుసు. శక్తిని పదార్థంగా మార్చటం కేవలం ఒక కాయితపు బొమ్మ/ పటంవల్ల జరగదు. కేటలిస్టులు/ పరికరాలు ప్రయోగానంతరం. ప్రయోగ పూర్వ స్థితిలో మిగిలిపోవాలి. అంటే ప్రతీ వారం పదిరోజులకి పాత సాయీ పటాన్ని మార్చి కొత్తదాన్ని అమర్చాల్సిరాదు. కనుక నా అభిప్రాయంలో ఈ థీసిస్‌కి పి. హెచ్. డి. అర్హతలేదు."

రెండో పరీక్షకుడు భట్ నగర్ అవార్డు విన్నర్ అయిన ప్రొఫ్ మేధావి. అతను ఆథర్ ఆఫ్ సెవరల్ హండ్రెడ్ పేపర్ పైగా గణపతి గైడైన వ్యాస్‌కి గురువు. అతనిల్లా వ్రాసాడు.

"నేను జినీవా వెళ్ళబోతూ ఈ రిపోర్ట్ వ్రాస్తున్నాను. నిన్ననే నాకీ థిసిస్ అందింది. చూడగానే అద్భుతమైనదని అర్థమై పోయింది. ఏక బిగిని చదివేసాను. మంచి ఫిక్షన్ నవల చదివి నట్టుంది. ఇతడు నాశిష్యుడి శిష్యుడవటం నాకు గర్వకారణం ఈ థీసిస్‌కి పి. హెచ్ డి. ఇమ్మని సిఫారస్ చేస్తున్నాను.

ముచ్చం మూడో ఎగ్జామినర్ ముచ్చటైన రిపోర్ట్ పంపాడు. "కొండిడేటు చేసిన ప్రయోగాన్ని నేను జీసస్ క్రైస్టు పటంతోనూ హిట్లర్ పటంతోనూ చేసి చూసాను. ఆ విధంగానే బూడిదలాంటి పదార్థం ఏర్పడింది. అందు చేత సాయి పటంతో కూడా బూడిదలాంటి పదార్థం ఏర్పడి ఉంటుందని నమ్ముతున్నాను. (ఆ ప్రయోగం చెయ్యటానికి నా దగ్గర మరి సాయి పటం లేదు కదా!) కొండిడేటు ఎక్కడా ఒక్క సాయి పటానికీ అది సాధ్యం అని వ్రాయలేదు. అది గమనించ తగ్గ విషయం. అతను తను కనుగొన్న దానిని యధా తథంగా వివరించాడు. స్థాయిని ఎండలో పెడ్తే బూడిద ఏర్పడుతుందని కనుగొన్నాడు. పైగా ప్రయోగ పూర్వం సాయి పటం బరువు ప్రయోగానంతరం సాయి పటం బరువు+- ఏర్పడిన బూడిద బరువుల కంటే తక్కువ అని వ్రాసాడో చోట. ఈ విధమైన ద్రవ్య రాసి ఎక్కడిది? అది సౌర శక్తి నుంచి ఏర్పడలేదని, వాతావరణం నుంచి వచ్చిందని ఊహించవచ్చు. అంత మాత్రాన కొండిడేటు క్లెయిము తప్పని ఋజువు చేసినట్టు కాదు. ఊహ ఋజువు కాదు. అది సౌరశక్తి నుంచి ఏర్పడలేదు. అని ఖండితంగా చెప్పలేను కనుక, కేండిడేట్ క్లెయిమ్‌కి బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇస్తూ డిగ్రీ ఇమ్మని రికమెండ్ చేస్తున్నాను."

## వైఫల్యం

నిజమే నీ నీడా
నీలాగే ఉంటుంది
కానీ ఉదయం, సాయంత్రం
నీకన్నా అది మిక్కిలి పొడగరి
నిన్ను గురించిన నీ అభిప్రాయాల్లాగ!
మధ్యాహ్నం మాత్రం
అతి కురుచన
నీపై జనాభిప్రాయంలాగ!

—ఎస్. కె. పార్థసారథి

# సాయిన్సు మిస్టరీ

ఆ రిపోర్టులు క్షుణ్ణంగా చదివిన డాక్టర్ వాది లేచి, "మొదటి ఎగ్జామినర్ ఈ ప్రయోగ ఫలితం అసంభవం అన్నాడు. ఆయన నోబెల్ లారెట్. ఆయన మాటకి మనం విలువ ఇవ్వాలి కాండిడేట్ ఆ విధంగా సంభవించిందని ఊహించాడే కాని ఋజువు చెయ్యలేదు మూడో ఎగ్జామినర్ డిగ్రీ ఇమ్మన్నా బెనిఫిట్ ఆఫ్ డౌట్ వల్ల ఇమ్మన్నాడు రెండో. ఎగ్జామినర్ రిపోర్ట్‌లో గర్వించ తగ్గది ఏమీలేదు, ఆశించ తగినది చాలా ఉన్నా, ఈ థీసిస్‌కి డిగ్రీ ఇస్తే మన యూనివర్సిటీ పరువు పోతుంది" అని వాదించాడు

అప్పుడు ప్రొఫెసర్ సెక్యులర్ లేచాడు ఆయన లేస్తున్నప్పుడు మెడలో క్రాస్ కదలాడింది. నుదుట విభూధి రేఖల కాంతి హాలంతా కమ్ముకుంది ఆయన మీస రహితమైన గడ్డాన్ని ఒకసారి నిమురుకొని

"ఇక్కడ మనం చర్చించాల్సిన విషయం, కాండిడేటు చేసిన ప్రకారం మనం ప్రయోగం చేస్తే పదార్థం ఏర్పడుతుందా? ఏర్పడదా? అన్నది నేను కూడా భౌతిక శాస్త్రవేత్తనే కాని తలతిక్కవేత్తను కాను మా ఇంట్లో కూడా ఇటువంటి సెటప్పే మా గురూజి ఏర్పాటు చేసారు. అది డిఫ్యూజ్‌డ్ లైటు మాత్రమే ఉన్న ప్రదేశంలో పెట్టారు అక్కడ ఇల్లాగే పదార్థం ఏర్పడుతోంది అందుకని సూర్య కిరణాలు పడే చోట పదార్థం ఏర్పడదని కాని, సూర్య కిరణాలు పడుతూ ఉండి పదార్థం ఏర్పడితే, దాంట్లో సౌరశక్తి ప్రమేయం ఏమీ లేదని కాని అనే అంతటి మూర్ఖుడిని కాదు పదార్థం అల్లాగూ ఏర్పడుతుంది ఇల్లాగూ ఏర్పడుతుంది మా ఇంట్లో గురూజి మానసిక శక్తివల్ల పదార్థం ఏర్పడితే, కాండిడేటు సెటప్‌లో సౌరశక్తి వల్ల ఏర్పడోతుందని మనం సరి అయిన అర్థం చెప్పుకోవాలి అంతే కాని రిపోర్టు రాసిన వాడు నోబెల్‌లారెట్ కదా అని నోరెళ్లబెట్టి దాన్ని స్వీకరించరాదని మనవి చేస్తున్నా నీ రోజు ఇక్కడి విద్యావేత్తలందరికీ" అని గంభీరంగా, ఉదాత్తంగా ఉపన్యసించి కూర్చున్నాడు

"అసంభవం అంటే అర్థం ఏమిటి?" అని వాది నిలదీసాడు

సెక్యులర్ లేచి నిలబడి, "నిన్న అసంభవం అనుకొన్నవి ఈ రోజు సంభవం కావాలని ఋజువు అయ్యాయి ఎన్నో విషయాలు పెద్ద సైంటిస్టులే విషయాల్లో పప్పులో కాలు వెయ్యటం అనాదిగా జరుగుతోంది ఈ నోబెల్ బహుమతి గ్రహీత అంతే!" అని శాంతంగా విశదీకరించాడు

"ఇప్పుడు మీ స్కూటర్‌లో పెట్రోలు బదులు నీళ్లు పోస్తే అది నడవదని సైన్సు చెప్తోంది ఈ రోజు అది రేపు సంభవం అని సైన్సు ఋజువు చేస్తుందని నమ్ముతారా?"

"ఎందుకు నమ్మను. నమ్ముతాను పూర్వం రోజుల్లోనే బస్సులు నీళ్లతో నడిచేవి ఇప్పటికి రైళ్లు నడుస్తున్నాయి. అందుచేత భవిష్యత్తులో స్కూటర్లు నీళ్లతో నడపవచ్చు అని నమ్ముతాను" అని గలగలా నవ్వేసాడు సెక్యులర్.

"జోక్ బావుంది స్టీమ్ ఇంజన్ నీళ్లతో నడవదని మెడమీద తలకాయ ఉన్న వాడెవడూ అనడు. పెట్రోలింజన్లో నీళ్లు పోసి, అంటే ఏమో డిఫికేషన్లు చెయ్యకుండా నడపటం భవిష్యత్తులో సంభవమని మీరు నమ్ముతారా అని అడుగుతున్నాను. దానికి మీరు సమాధానం చెప్పక కప్పదాట్లు వేస్తున్నారు"

ఈ ఇద్దరి ధోరణి చూస్తుంటే ప్రొఫెసర్ భక్తికి వళ్లు మండింది ఈ ఎకడమిక్ బాడీ వీళ్ల బాబుగారి కొలువా? మాట్లాడటానికి వీళ్లిద్దరే గుత్తకి తీసుకొన్నారా? తనకి కూడా ఈ విషయంలో అభిప్రాయాలున్నాయని వాళ్లకి తెలియజెప్పాలి "నీళ్లతో నడిచిన పెట్రోలింజన్లు భూమ్మీద ఉన్నాయి. ఈనాటి సైన్సు దాన్ని ఎక్స్‌ప్లెయిన్ చెయ్యలేకపోవచ్చును. సామాన్యులు దాన్ని అద్భుతంగా అనుకోవచ్చు రేపటి సైన్సు తప్పక దాన్ని తన పరిధిలోకి ఇముడ్చుకొంటుంది. అల్లాంటి ఉదంతాలు చాలా రికార్డు చెయ్యబడి ఉన్నాయి" అన్నాడు భక్త.

"అలాంటి అద్భుతాలీ భూమ్మీద లేవు. ఉన్నాయని నాకెవరైనా ఋజువు చేస్తేగాని నమ్మను" అన్నాడు వాది.

"మీ నమ్మకాలతో అవతల వాళ్లకి ప్రమేయం లేదు మీకు ఋజువు చెయ్యాల్సిన అవసరం అంతకంటే లేదు. ప్రత్యేకమైన వ్యక్తులు, ప్రత్యేకమైన సమయాల్లో అజ్ఞానులు అద్భుతాలని అనుకొనేవి చేసి చూపగా ప్రత్యేకమైన వ్యక్తులు చూసి రికార్డు చేశారు." "నేను చూడలేదు నేను నమ్మను."

"అది శాస్త్రీయ దృక్పథం కాదు. తాము చూడనంత మాత్రాన శాస్త్రజ్ఞులు కాదనరాదు. వాళ్లకి ఏ విషయంలోనైనా ఓపెన్ మైండ్ ఉండాలి. ఎవరైనా ఏదైనా అంతే కామోసు అనుకోవాలి లేకపోతే సత్యాన్ని మిస్ అవుతారు ఉదాహరణకి ఈ గదిలో నేను కళ్లు తెరుచుకొని అంటే ఓపెన్ మైండ్‌తో ఉన్నాననుకొందాం వాదిగారు కళ్లు మూసుకొని అంటే క్లోజ్‌డ్ మైండ్‌తో ఉన్నారనుకొందాం నాకు మన చైర్మన్ అయిన వైస్ ఛాన్స్‌లర్‌గారు కుర్చీలో ఉన్న విషయం కనిపించి 'ఆయన అక్కడ ఉన్నారు' అంటాను వాదిగారు 'నాకు కనిపించడం లేదు. కనుక లేరు' అంటారు 'అభిప్రాయాల్ని అసింటానెట్టి కళ్లు తెరుచుకొంటే కనిపిస్తారు' అంటాను నేను అయితే అల్లా కనిపించడానికి ఆ చూసేవాళ్లు కూడా ఈ గదిలో ఉండాలి ఈ గది బయట ఉన్నవాళ్లు కళ్లు తెరుచుకొని చూసినా కనిపించరు" భక్త తనవాదం ముగించి గర్వంగా అందరివైపు చూసాడు ప్రతివాదులందరు సెబాష్ అన్నట్టు చూసారు

"నాకు శ్రీవారి భార్య వారి పక్కన కళ్లు మూసుకొన్నందువలన కనిపించడం లేదనుకొని కళ్లు తెరుచుకొని చూస్తున్నాను అయినా కనిపించటం లేదు. కారణం ఆవిడక్కడ లేరు కనుక ఎన్ని థీయరీలు చెప్పి వాదించినా, అక్కడ లేనిది ఉన్నట్టు కాదు. భక్తగారికి శ్రీవారి భార్య వారి పక్కన కనిపిస్తున్నారా?" వాది కౌంటర్ పాయింట్ చెప్పాడు.

చర్చ కేండిడేటు డిగ్రీనుంచి తన భార్య అస్తిత్వంలోకి దిగటంతో వైస్ ఛాన్స్‌లర్ జాగ్రత్తపడి

"ఈ చర్చ ఇక్కడితో ముగిస్తున్నాను నా పక్కన కూర్చున్న ప్రొఫ్ శంకుతీర్థులవారు ఇందులో శంకించటానికి ఏమీలేదు. అని చెప్పున్నారు. ప్రొఫ్ భక్త ప్రొఫ్ సెక్యులర్ ఇదే అభిప్రాయాలు వెలిబుచ్చారు డాక్టర్ వ్యాస్ ఆరోగ్యకరమైన విద్యా పద్ధతిలో చర్చలో పాల్గొనలేదు అది తనకి సంబంధించిన విషయం కనుక ఫాక్ట్స్ చూద్దాం ఇద్దరు ఎగ్జామినర్స్ డిగ్రీ ఇమన్నారు ముగ్గురిలో మెజారిటీ ఒపీనియన్‌ని స్వీకరించకపోతే రూల్స్ బ్రేక్ చేసినట్టవుతుంది. అల్లా బ్రేక్ చెయ్యటానికి బలమైన కారణాలు చూపాలి అంగీకరించడానికి అక్కర్లేదు అందుకని శ్రీ గణపతికి డిగ్రీ ఇవ్వాలన్న నిర్ణయం ఛెయిర్‌మన్‌గా తీసుకొన్నాను" అని భరత వాక్యం పలికాడు

ఆ విధంగా సాయిన్సు మిస్టరీ ముగిసింది

రచయిత.– ఇది ఎవర్ని ఉద్దేశించి వ్రాసింది కాదు ఇటువంటి థీసిస్‌ని ఇండియాలో ఎవరూ వ్రాయలేదు, దాని కెవరు పి హెచ్ డి. ఇవ్వలేదు అనే అనుకొంటున్నాను! అయితే చర్చలు కొన్నింటిని కొంచెం అతిశయోక్తికి లాగితే పై విధంగా ఉంటాయని సెనేట్‌లో కూర్చుని ఉన్న కొన్ని సమయాల్లో, అనుకొన్నాను అదిమాత్రం నిజం. నాయడమ్మగారు బెంగుళూరులో "సాయి ఎన్సు" చాలా వేగంగా వృద్ధి పొందుతోందని అనటం కూడా ఈ రచనకి దోహదం చేసింది. □